

పోషకాహారాన్ని పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలం : మేయర్ పారిజాత

సరూర్‌నగర్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటేనే ఇద్దరి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ హయత్‌నగర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం బాలాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, పిల్లలు తీసుకోవాల్సిన బలవర్ధక ఆహార పదార్థాలను పరిశీలించి టేస్ట్ చేశారు. అనంతరం పారిజాత మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని అన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు కచ్చితంగా తాగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సీడీపీవో రేణుక, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం జిల్లా కోఆర్డినేటర్ ఆశ్రిత, శ్రీనివాస్, సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



టవర్ పనులు ఆపాలని మున్సిపల్ కార్యాలయం వద్ద వినతిపత్రంతో విద్యార్థులు

సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపండి

- కమిషనర్‌కు సత్యం టెక్నోస్కూల్ విద్యార్థుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని 7వ వార్డులో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయించాలని కోరుతూ బుధవారం సత్యం టెక్నోస్కూల్ విద్యార్థులు, శివగంగా కాలనీవాసులు, బీఎస్పీ నేత యాంజాల్ ప్రహ్లాద్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ పక్కనే సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని.. టవర్ రేడియేషన్ ప్రభావంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్కూల్‌లో 600 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. టవర్ చుట్టూ నివాస గృహాలు ఉన్నాయని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం అరవింద్‌బాబు, కాలనీ వాసులు దేవేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, యాకయ్య, రవీందర్‌రావు, లింగయ్య పాల్గొన్నారు.



ఏఐటీయూసీ సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఏఐటీయూసీ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 23,24 తేదీల్లో శంషాబాద్, తుక్కుగూడలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను బుధవారం ఆర్‌ఎస్‌ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని.. ఆటో కార్మికులకు నెలవారీగా రూ.12వేలను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దాసరి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నర్సింహ, ఈశ్వరయ్య, రాములు, శ్రీనివాస్, సాగర్, మల్లెపతి రవి, శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.



స్వచ్ఛతా ర్యాలీలో విద్యార్థులతో కౌన్సిలర్ గీతావేణుగోపాల్‌రెడ్డి

స్వచ్ఛతా హీ సేవాపై అవగాహన ర్యాలీ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతాపై ప్లకార్డులతో విద్యార్థులు అవగాహన కల్పిస్తూ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దేవిడి గీతావేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాధ్యతగా ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతాపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



సంజయ్ గైక్వాడ్ దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న శివచరణ్‌రెడ్డి తదితరులు

సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలి: శివచరణ్‌రెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర షిండే గ్రూప్‌కి చెందిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని బీజేపీ చూస్తోందన్న రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు తప్పుదోవపడుతూ సంజయ్ గైక్వాడ్ రాహుల్‌గాంధీ నాలుక కోసి తెచ్చిన వారికి రూ.11లక్షలు ఇస్తామనడంపై బుధవారం మన్సూరాబాద్ డివిజన్ ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సంజయ్ గైక్వాడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడు రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో చేసిన వ్యాఖ్యలను బీజేపీ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని, ఇందుకు బీజేపీ మిత్రపక్షమైన షిండే గ్రూప్ శివసేన పార్టీ తోడయ్యిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, నాయకులు సామిడి చరణ్, గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, కళ్లెం నర్సింహారెడ్డి, మహేందర్, పృథ్వీరాజ్ శ్యామల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



వాసవీకాలనీలో గణనాథుడి లడ్డూను వేలంపాటలో రూ. 4,92,000లకు దక్కించుకున్న తోడుపునూరి ప్రసన్న సతీష్



సాహెబ్‌నగర్ శ్రీరామ్ గణేశ్ యూత్ గణేశ్ లడ్డూను రూ.5.50లక్షలకు దక్కించుకున్న వినిత్‌గౌడ్, ముద్దగౌని జగన్‌మోహన్‌గౌడ్, మనీష్‌గౌడ్



నాదర్‌గుల్ వివేకానంద యూత్ గణనాథుడి లడ్డూను రూ.4.20లక్షలకు సొంతం చేసుకున్న పెత్తుల్ల యాదిరెడ్డి

జోరుగా లంబోదరుడి లడ్డూల వేలం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలోని లడ్డూ వేలం పాటలు జోరుగా కొనసాగుతున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా స్థానిక భక్తుడు పెత్తుల్ల యాదిరెడ్డి రూ.4.20లక్షలకు సొంతం చేసుకున్నారు. అదేవిధంగా స్వామి వారి శాలువాను రూ.90వేలకు తోట శ్రీరాంరెడ్డి దక్కించుకున్నారు. వారిని ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించి లడ్డూ, శాలువా అందజేశారు.

సిర్లాహిల్స్‌లో రూ.1.30లక్షలు

మీర్‌పేట్ 27వ డివిజన్‌లోని సిర్లాహిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా స్థానిక భక్తుడు డి.కొండల్‌రెడ్డి-ప్రగతి దంపతులు రూ.1.30లక్షలకు దక్కించుకున్నారు. కార్పొరేటర్ భిక్షపతిచారి వారికి లడ్డూ ప్రసాదం అందజేసి శాలువాతో సత్కరించారు.

నందిహిల్స్‌లో రూ.2.25లక్షలు

మీర్‌పేట్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌కాలనీలో ప్రతిష్ఠించిన లంబోదరుడిని మంగళవారం రాత్రి మంత్రాలచెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయకుడి చేతిలోని పెద్ద లడ్డూను వేలంలో రూ.2.25లక్షలకు సత్యనారాయణరెడ్డి రజిత దంపతులు దక్కించుకోగా, చిన్న లడ్డూను రూ.33,300కు శ్రీనివాస్‌రెడ్డి అరుణ దంపతులు సొంతం చేసుకున్నారు. పూజా కలశాన్ని రూ.36వేలకు సుధాకర్‌రెడ్డి ఇందిర దంపతులు, స్వామి వారి ధోతీని రూ.14వేలకు పవన్‌కుమార్ కైవసం చేసుకున్నారు.

వెంకటసాయి ఎన్‌క్లేవ్‌లో

జిల్లెలగూడ 16వ డివిజన్‌లోని వెంకటసాయి ఎన్‌క్లేవ్‌లోని వినాయకుడి లడ్డూను రూ.35వేలకు అబ్బు శారదావేణుగోపాల్‌యాదవ్ దక్కించుకోగా, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌యాదవ్ వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు.

సరూర్‌నగర్, ఆర్‌కేపురంలలో..

ఎల్బీనగర్ : ఆర్‌కేపురం వాసవీకాలనీలో గణనాథుడి లడ్డూను వేలంపాటలో రూ. 4,92,000లకు తోడుపునూరి ప్రసన్న సతీష్ కైవసం చేసుకున్నారు. వారికి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి లడ్డూ అందజేసి సన్మానించారు. సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లో పాంచజన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూ ప్రసాదాన్ని వ్యాపారి అంజయ్య రూ.1,20,000లకు కైవసం చేసుకున్నారు. చిన్న లడ్డూను సూర్యసరోజ్ అపార్ట్‌మెంట్ నివాసి అనిత దోరే రూ. 55 వేలకు దక్కించుకున్నారు. పంజాల అనిల్‌కుమార్‌కాలనీలోని అభయాంజనేయ, ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని ప్రముఖ సినీ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న సాయినాథ్‌కు నిర్వాహకులు అంకిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రిషీ లడ్డూను అందజేశారు.

తొమ్మిదోసారి లడ్డూను దక్కించుకున్న వైవిరెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ డిఫెన్స్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను రూ. 3.06లక్షలకు తొమ్మిదోసారి కాలనీకి చెందిన వైవిరెడ్డి వేలంపాటలో దక్కించుకున్నారు. 2016వ సంవత్సరం నుంచి వైవిరెడ్డి లడ్డూ వేలంపాటలో పాల్గొని తన భక్తిని చాటుకుంటున్నారు. కాలనీ ప్రతినిధులు వైవిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి లడ్డూ ప్రసాదంను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



పంజాల అనిల్‌కుమార్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గణనాథుని పూజల్లో సినీ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్

కుంట్లూర్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని శ్రీ వేంకటేశ్వరకాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో లంబోధరుడి లడ్డూను కాలనీకి చెందిన చెలికానీ గోవర్ధన్‌రెడ్డి రూ. 2,23,000లకు దక్కించుకున్నారు. కలశాన్ని 2లక్షల నలభై వేల పదకొండు రూపాయలకు కట్టి సత్యనారాయణరెడ్డి కైవసం చేసుకున్నారు. వేలం పాటలో వార్డు కౌన్సిలర్ కందాడ అనుపమాసుప్రసేనారెడ్డి హాజరై లడ్డూ, కలశంను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మొద్దు బస్వరెడ్డి, కొలను ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గోవర్ధన్, సుధాకర్‌రెడ్డి, పద్మరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

రూ. 5.50లక్షలు పలికిన సాహెబ్‌నగర్ గణపతి లడ్డూ

వనస్థలిపురం: సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీరామ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26 అడుగుల గణనాథుని లడ్డూను పెద్ద అంబర్‌పేట్‌కు చెందిన వినిత్‌గౌడ్ రూ.5లక్షల50వేలకు దక్కించుకున్నారు. వనస్థలిపురం డివిజన్ పద్మావతినగర్‌కాలనీలో గణేశ్ లడ్డూను కాలనీకి చెందిన శ్రీరామ్‌రెడ్డి కనకదుర్గ దంపతులు రూ.1.5 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముద్దగౌని జగన్‌మోహన్‌గౌడ్, రంజిత్‌గౌడ్, మనీష్‌గౌడ్, సంతోష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట పీవీటీ మార్కెట్‌లో లడ్డూను రూ.2,01,000లకు దక్కించుకున్న జెల్ల చంద్రశేఖర్



పద్మావతినగర్‌కాలనీలో లడ్డూను రూ.1.5లక్షలకు దక్కించుకున్న శ్రీరామ్‌రెడ్డి కనకదుర్గ దంపతులు



ఇంద్రానగర్ కమ్యూనిటీహాల్‌లో గణేశ్ లడ్డూను రూ.1.20 లక్షలకు దక్కించుకున్న బండారి నవీన్



మీర్‌పేట్ సిర్లాహిల్స్ కమ్యూనిటీహాల్‌లో గణేశ్ లడ్డూను రూ.1.30లక్షలకు దక్కించుకున్న కొండల్‌రెడ్డి దంపతులు

సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌కు పోటెత్తిన విగ్రహాలు

- ప్రశాంతంగా ముగిసిన సామూహిక నిమజ్జనం
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌కు ఈ ఏడాది నిమజ్జన విగ్రహాలు పోటెత్తాయి. వేలాది విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు సరూర్‌నగర్ చెరువుకు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది సుమారు నాలుగు వందల విగ్రహాలు అధికంగా నిమజ్జనం చేశారు. నవరాత్రుల 3వ రోజు నుంచి 11వ రోజుకు సుమారు 3,664 విగ్రహాలు నిమజ్జనమైనట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించారు. ప్రశాంతవాతావరణంలో సామూహిక నిమజ్జనం ముగియడంతో అన్ని శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అందుబాటులో మూడు క్రేన్‌లు

ఇంకో రెండు, మూడు రోజుల పాటు విగ్రహాలు నిమజ్జనానికి తరలిరానున్నాయి. అయితే 11వ రోజు సామూహిక నిమజ్జనం వరకు కట్టపై 11 క్రేన్‌లు నిమజ్జనం కోసం వినియోగించగా, బుధవారం నుంచి మరో రెండు, మూడు రోజుల పాటు 3 క్రేన్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. సామూహిక నిమజ్జనం రోజు నిమజ్జనం చేయకుండా ఉన్నటువంటి విగ్రహాలను వెంటనే నిమజ్జనం చేయాలని కోరారు.



చెరువుకట్టపై క్యూకట్టిన నిమజ్జన వాహనాలు

నిమజ్జన విగ్రహాల తీరిలా..!

3వ రోజు నుంచి 11 వరోజు వరకు సరూర్‌నగర్ చెరువులో 3,664 విగ్రహాలు నిమజ్జనం చేశారు. గత సంవత్సరం కంటే 400 విగ్రహాలు ఈ ఏడాది ఎక్కువగా నిమజ్జనానికి తరలివచ్చినవి. వీటి సంఖ్య మరో మూడు, నాలుగు వందల వరకు పెరిగే అవకాశం ఉంది. వినాయక నవరాత్రులు 3వ రోజు 193 విగ్రహాలు, 4వ రోజు 37 విగ్రహాలు, 5వ రోజు 512 విగ్రహాలు, 6వ రోజు 418 విగ్రహాలు, 7వ రోజు 148 విగ్రహాలు, 8వ రోజు 285 విగ్రహాలు, 9వ రోజు 838 విగ్రహాలు, 10వ రోజు 533 విగ్రహాలు, 11వ రోజు సామూహిక నిమజ్జనం రోజు 780 విగ్రహాలు నిమజ్జనం చేశారు.



డివైడర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

షటిల్‌కోర్టు, ఉద్యానవనం నిర్మాణానికి 1.80కోట్లు

చంపాపేట, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాగర్ రింగ్ రోడ్ జంక్షన్‌లో షటిల్‌కోర్టు, ఓపెన్‌జిమ్ నెట్, క్రికెట్, వాలీబాల్, ఉద్యానవనం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి 80లక్షలు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. బుధవారం కార్పొరేటర్ మాట్లాడుతూ మంజూరైన నిధులతో షటిల్‌కోర్టు, ఓపెన్‌జిమ్, నెట్ క్రికెట్, వాలీబాల్ క్రీడలతో పాటు ఉద్యానవనం నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు, సీఎం రేవంత్‌రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సాగర్‌రింగ్ రోడ్ జంక్షన్‌కు కోట్లాది రూపాయలు మంజూరు చేయడం పట్ల కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో హస్తినాపురం డివిజన్‌లోని అన్ని కాలనీలను అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

డివైడర్ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలి

డివైడర్ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ సుజాతానాయక్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని సాగర్‌రింగ్ రోడ్ నుంచి టీకేఆర్ కాలేజ్ కమాన్ వరకు, సాగర్‌రింగ్ రోడ్ నుంచి బొబ్బిలి దామోదర్ రెడ్డి గార్డెన్ వరకు నిర్మిస్తున్న డివైడర్ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కోటీ ఎనభై లక్షలతో డివైడర్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా డివైడర్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బిక్కునాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో వావి వరుసలు మరిచి కన్న కుమార్తెపైనే అత్యాచారానికి యత్నించిన కేసులో ఓ తండ్రికి మల్కాజిగిరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 2019 ఏప్రిల్ 11న తాగి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో భార్య ఇంట్లో లేదు. తాగిన మైకంలో పదో తరగతి చదువుతున్న తన కుమార్తెపై అత్యాచారం చేయబోయాడు. బాలిక తప్పించుకొని బయటకు పరుగుతీసి తల్లి పనిచేస్తున్న ఇంటికి వెళ్లి ఆమెకు విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడేళ్ల కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16 సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. గస్తీని ముమ్మరం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ తెలిపారు. మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలోని దర్గా నుంచి భారీ ర్యాలీ జరగనుంది. మూసారాంబాగ్ బస్తీ మీదుగా ర్యాలీ వెళ్లనుంది. అదేవిధంగా చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శంకర్‌నగర్, ముసానగర్, కమల్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట ప్రాంతాల నుంచి ర్యాలీలు నిర్వహించేందుకు పోలీసుల అనుమతి పొందారని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. లాలాజర్ హోటల్ చౌరస్తాలో, ఓల్డ్‌మలక్‌పేట పంచశీల్ లైబ్రరీ వద్ద, చాదర్‌ఘాట్ చమన్, ఈదార్ ఏ మిలియా, మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణ

ఖర్చు భరిస్తున్న డిప్యూటీ మేయర్

- ఇద్దరు స్వీపర్లకు రూ.6వేలు చొప్పున వేతనం అందజేత

సరూర్‌నగర్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ బాలాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని టాయిలెట్ల నిర్వహణ బాధ్యతను భుజాన వేసుకున్నారు. నాలుగేళ్లుగా ఆయన ఇక్కడి పాఠశాలలోని ఇద్దరు స్వీపర్లకు నెలకు ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున సొంతంగా వేతనం చెల్లిస్తూ టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుతున్నారు. కాగా ఇటీవల పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని, దీని కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని సీఎం ప్రకటించడం, ఆ వెంటనే జీవో జారీ కావడం కూడా జరిగాయి. దాంతో శేఖర్ రెండు నెలలుగా వారికి వేతనాలు ఇవ్వడంలేదు. అయితే రెండు నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో స్వీపర్లు లక్ష్మమ్మ, ఝాన్సీ తాము పని మానేస్తామని తెలియజేశారు. దాంతో శేఖర్ వెంటనే స్పందించి సదరు రెండు నెలలకు సంబంధించిన వేతనం ఒక్కొక్కరికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.24వేలు బుధవారం వారికి చెక్కు రూపంలో అందజేశారు. హెడ్మాస్టర్ రామానుజరెడ్డి, తూళ్ల సునీతా గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వీపర్లు లక్ష్మమ్మ, ఝాన్సీలకు సొంతంగా వేతనం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శేఖర్

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నార్సింగ్: గండిపేట జలాశయంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. వివరాల ప్రకారం.. నెలిమిఫామ్‌హౌస్‌కు సమీపంలోని గండిపేట చెరువులో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. మృతిచెందిన మహిళకు దాదాపు 30 సంవత్సరాలు ఉంటాయని, మెరూన్ కలర్ టాప్, క్రీం కలర్ లెగ్గిన్ ధరించిందని ఎస్‌ఐ తెలిపారు. మెడలో నల్లని దారంతో కూడిన తాయత్తు ఉందని, గుర్తుపట్టేందుకు వీలులేకుండా ముఖం ఛిద్రమైందని తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మన్సూరాబాద్‌లో రెండు బైకులను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు

కొత్తపేట: ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ చౌరస్తాలో కారు రెండు బైకులను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం శారదానగర్‌కు చెందిన యెమినేని గోపీ(32), తన తండ్రి వెంకటేశ్వర్‌రావు(60) బుధవారం బైకుపై సహారా టౌన్‌షిప్ మీదుగా మన్సూరాబాద్‌కు వెళ్తున్నా రు. వారు మన్సూరాబాద్ చౌరస్తాకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైకును, మరో బైకుపై వెళ్తున్న వనస్థలిపురం అరుణోదయనగర్‌కు చెందిన ఎస్.కృష్ణారెడ్డి(49)ని ఢీకొట్టింది. దీంతో కృష్ణారెడ్డి కుడికాలుకూ, గోపీ కుడి కాలుకు ఫ్రాక్చర్ అయింది, వెంకటేశ్వర్‌రావు ఎడమ భుజానికి, కాళ్లకూ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురిని వనస్థలిపురం ప్రాగ్మా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ హిమపురి కాలనీకి చెందిన బచ్చల నరేందర్(32) ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గోపీ భార్య యెమిని అనిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్న కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఉత్సవాలకు సహకరించిన అధికారులకు ధన్యవాదాలు

- జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం విధుల్లో ఉంటూ విజయవంతం చేసిన జీహెచ్‌ఎంసీ, పోలీసు, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులకు, సిబ్బందికి జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఆయన బుధవారం అధికారులు, సిబ్బందిని కలిశారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌లు సుజాత శ్రీనివాస్, సేవ ఇస్లావత్, ఎస్‌ఐ మారయ్య, శానిటేషన్ డీఈ చందన, నగేష్‌నాయక్, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



పరవస్తు కృష్ణ

మన్సూరాబాద్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యం అయిన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌లోని రాజ్యలక్ష్మీ కాలనీకి చెందిన పరవస్తు కృష్ణ(77) గత నెల 31న కుటుంబ సభ్యులకు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికి వారి బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో వృద్ధుడి కుమారుడు పరవస్తు నవీన్ ప్రకాశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.